క్లుప్తంగా

విలక్షణ నటుడు 'కోట'కు ఘన నివాళి



కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

మార్కాపురం: విలక్షణ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని బ్రాహ్మణ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక శివాలయం వద్ద ఆదివారం కోట శ్రీనివాసరావు చిత్రపటానికి జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ పురోహిత, అర్చక, రుత్వికుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అటు సినీ రంగం, ఇటు రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలను సంఘ నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీధర సుబ్బు, ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ, పి.శివకుమార్, కె.ప్రసాద్ శాస్త్రి, ఓరుగంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందాల్సిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సోమవారం ఉదయం 9 గంటలకు అర్ధవీడు గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

వెలుగొండ గురుకులంలో..

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఎస్సీ కేటగిరీలో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్.ఇబ్రహీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డుతో గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన అల్లూరయ్య

బేస్తవారిపేట: మండలంలోని చింతలపాలెం బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కంభం మండలంలోని లింగోజీపల్లెకు చెందిన అల్లూరయ్య కూలీ పనులు చేసుకుంటూ చింతలపాలెం, బేస్తవారిపేట పరిసర ప్రాంతాల్లో జీవిస్తున్నాడు. చింతలపాలేనికి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచాలి



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బందికి గత ఏడేళ్లుగా వేతనం పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. ఆదివారం నుంచి మున్సిపల్ కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిత్యావసర సరుకులతోపాటు అన్ని ఖర్చులు పెరిగాయని, అందుకు అనుగుణంగా వేతనం ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు సమానంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా వేతనం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు ఆర్థిక సాయంతోపాటు విశ్రాంత కార్మికులకు పింఛను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పది నెలలవుతున్నా పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, సలామ్, హరి, వెంకటేశ్వర్లు, శేఖర్, కేశవరావు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొనకనమిట్ల: ఈ నెల 15వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధిపై సమీక్షించనున్న నేపథ్యంలో అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

దొంగలొచ్చారు జాగ్రత్త!



చౌక్ సెంటర్‌లో బైక్ అపహరించుకెళ్తున్న వ్యక్తి (సీసీ ఫుటేజ్ దృశ్యం)



వైజంక్షన్ సమీపంలో బైక్ అపహరించిన వ్యక్తి (బైక్‌పై వెనుక కూర్చున్నవాడు)

- కంభం పట్టణంలో మళ్లీ మొదలైన చోరీలు
- గడిచిన వారంలో మూడు బైకులు మాయం, రెండు గృహాల్లో చోరీ
- చోరీలన్నీ పగటి పూటే చోటుచేసుకున్న వైనం
- ప్రతి చోరీలో సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన నిందితుడి ఆనవాళ్లు
- గస్తీ పెంచాలని పోలీసులకు ప్రజల విజ్ఞప్తి

కంభం:

కంభం పట్టణంలో వరుస చోరీలతో దొంగలు రెచ్చిపోతున్నారు. గడిచిన వారం రోజులుగా ద్విచక్రవాహనాలు, గృహాల్లో నగలు, నగదు అపహరించుకెళ్తూ పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రతి చోట సీసీ కెమెరాల్లో నిందితుడి చిత్రాలు నిక్షిప్తమవుతున్నా నిందితులను అరెస్టు చేయడంలో అలసత్వంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కంభంలో గత వారం రోజుల్లో 3 బైకులు అపహరణకు గురికాగా, ఇద్దరు మాజీ సైనికుల ఇళ్లలో నగలు, నగదు పోయాయి.

కాపు కాసి బైకుల అపహరణ

☛ పట్టణంలోని వైజంక్షన్‌లో ఓ దుకాణం వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మీకు పార్సిల్ వచ్చింది ఆఫీసు వద్ద ఉంది అని చెప్పాడు. అతని వెంట దుకాణం యజమాని కొడుకుని తీసుకెళ్లి చౌక్ సెంటర్‌లో ఒక చోట నిలబెట్టి 5 నిమిషాల్లో వస్తానని చెప్పి అతని హీరో ప్యాషన్ ప్రో బైక్‌తో పాటు మొబైల్ ఫోన్ తీసుకుని పరారయ్యాడు. ఈ దృశ్యాలు పలు చోట్ల సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి.

☛ బేస్తవారపేటకు చెందిన భాస్కరరెడ్డి అనే వ్యక్తి ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం కంభం బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలోకి వెళ్తూ తన బైక్ పక్కన పార్క్ చేశాడు. పది నిమిషాల తర్వాత ఆస్పత్రి నుంచి బయటకు రాగా అక్కడ బైక్ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో పరారైన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

☛ ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30 నిమిషాల సమయంలో రైల్వే ఉద్యోగి ప్రేమ్ కుమార్ గేట్ వద్ద హీరో గ్లామర్ బైక్ పార్క్ చేశాడు. విధుల్లో భాగంగా రైలు పట్టాల మీదికి వెళ్లి పది నిమిషాల్లో తిరిగొచ్చే సరికి అక్కడ బైక్ లేకనపోవడంతో నిశ్చేష్టుడయ్యాడు.

ఒకే రోజు రెండు చోరీలు

ఈనెల 11వ తేదీన పట్టణంలోని రహమత్ నగర్, ఎల్‌బీఎస్ నగర్‌లో ఇద్దరు మాజీ సైనికుల గృహాల్లో దొంగలు చేతివాటం చూపారు. సుమారు 6 తులాల బంగారు నగలు, నగదు అపహరించారు. అలాగే గత నెల 25వ తేదీన కంభం మండలంలోని తెల్లదిన్నె గ్రామంలో పురాతన రామాలయంలో సీతారామ లక్ష్మణుల పంచలోహ విగ్రహాలు మాయమయ్యాయి. ఈ కేసు దర్యాప్తు కొలిక్కిరాలేదు.

అన్ని చోట్లా ఒకే వ్యక్తి?

బాధితుల కథనం ప్రకారం గత వారం రోజుల్లో చోటుచేసుకున్న చోరీలన్నీ సన్నగా పొడవుగా ఉన్న, మాస్క్ పెట్టుకున్న వ్యక్తి చేసినట్లు తెలుస్తోంది. వైజంక్షన్ వద్ద, రైల్వే గేటు వద్ద జరిగిన బైకు దొంగతనాలు, రహమత్ నగర్‌లోని గృహంలో చోరీకి సంబంధించిన సీసీ ఫుటేజీలో ఒకే వ్యక్తి ఉన్నాడు. ఇదే వ్యక్తి గతంలో కంభం, మార్కాపురంలో బైక్‌లు అపహరించగా పోలీసుల దర్యాప్తులో వినుకొండ వాసిగా తేలింది. పోలీసులు కొన్ని ద్విచక్ర వాహనాలను సైతం రికవరీ చేసినట్లు తెలిసింది. కొంత కాలంగా ప్రశాంతంగా ఉన్న కంభం పట్టణంలో మళ్లీ దొంగతనాలు జరుగుతుండటంతో స్థానికులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పోలీసులు నిఘా పెంచాలి

పట్టణంలో ఇటీవల దొంగతనాలు పెరిగిపోతున్న నేపథ్యంలో పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి పూట గస్తీ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలోనూ పట్టణంలో ఎస్‌బీఐ, ఆర్టీసీ బస్టాండ్, అర్బన్ కాలనీ, చౌక్ సెంటర్‌లో పలు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయని, పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఈనెల 11న రహమత్ నగర్‌లో ఓ గృహంలో చోరీకి పాల్పడిన అనుమానితుడు (సీసీ ఫుటేజ్ దృశ్యం)



ఈనెల 9న కంభం బస్టాండ్ సమీపంలో వైద్యశాల వద్ద బైక్ అపహరించిన వ్యక్తి(సీసీ ఫుటేజ్ దృశ్యం)



అన్నా రాంబాబును సన్మానిస్తున్న గురవయ్య తదితరులు

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె సూచన

మార్కాపురం: ఇటీవల పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సూచించారు. గత ప్రభుత్వంలో మనం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ మార్కాపురం మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన బూదాల గురవయ్య, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడిగా నియమితులైన ఏరువ వెంకటేశ్వరరెడ్డి ఆదివారం అన్నా, జంకెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పి.చెంచిరెడ్డి, శివరాంపురం సర్పంచ్ డి.నాదగురుబ్రహ్మం, నల్లబోతుల కొండయ్య, గౌస్ మొహిద్దీన్, మందటి శివారెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



తర్లుపాడులో ఊరేగుతున్న పీర్లు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో పీర్ల పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను రంగు రంగుల పూలు, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించి, మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులకు పప్పులు, బొరుగులు పంచిపెట్టారు.

తీరిన మంచినీటి సమస్య

- జేసీ అగ్రహారంలో నూతన మోటార్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డులో సింగిల్ ఫేజ్ విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురికావడంతో కాలనీవాసులు 20 రోజులుగా మంచి నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఆదివారం ×మంచినీటి సమస్యతో అవస్థలు₹ శీర్షికన ×సాక్షి₹లో ఆదివారం ప్రచురించిన కథనానికి ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు స్పందించారు. నూతన మోటారు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులకు నీటి సమస్య తీరింది. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్

శ్రీవారికి శ్రవణా నక్షత్ర పూజలు



రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు వెలుగొండలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు సింహాద్రిచార్యులు, విజయకాంత్‌శర్మ, వెంకటరామకృష్ణాచార్యులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

వద్దిమడుగు, వాగుమడుగు, రేగడపల్లి గ్రామాలలోని పోలేరమ్మతల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టారు.

ముద్దసానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మార్కాపురం: మార్కాపురం మండలం జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల మధ్య గ్రామ దేవత ముద్దసానమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాలైన కొత్తపల్లి, ఎల్‌బీయస్ నగర్, నికరంపల్లితోపాటు మార్కాపురం పట్టణానికి చెందిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు విశేష పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం ప్రాంత ప్రజల ఇలవేల్పు అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని పూలు, నిమ్మకాయల దండలతో అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్‌శర్మ అలంకరించారు. పలువురు భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి, పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్ధవీడు: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లి, కొత్తూరు గ్రామాల్లో పోలేరమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి, 101 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం: శ్రీలక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీవారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో సుమారు 150 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మార్కాపురం జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పట్టణ శివారులోని కమలా హైస్కూల్ వేదికగా ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు అలనాటి సంగతులు గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. సమావేశానికి పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము నేతృత్వం వహించారు. ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు ఢిల్లీ, చెన్నై, బెంగళూరులో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరై యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబు, జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సంఘం సేవా కార్యక్రమాలను కొనియాడారు. 2016లో శత వసంతాల వేడుక సందర్భంగా కలిసిన పూర్వ విద్యార్థులు మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత కలవడం అభినందనీయమన్నారు. అనంతరం వారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సంఘం తరఫున సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. పెహల్గాం మృతులకు, మృతి చెందిన పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జీఎల్ నరసింహారావు, శ్రీనివాస మల్లికార్జున్, దాసరి వెంకటేశ్వర్లు, కె.విశ్వేశ్వరరావు, డాక్టర్ బాషా, రాంబాబు, అక్కల నారాయణ, తన్నీరు వెంకటరమణ, డీవీఆర్, బట్టగిరి శేఖర్ రెడ్డి, నాగరాజు, పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులవరం హైస్కూల్లో..

అర్ధవీడు: మండలంలోని నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. అప్పటి ప్రధానోపాధ్యాయుడు గాదం పుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సైన్సు టీచర్ అన్నం ప్రభాకరెడ్డి తదితరులు ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకోవడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు మంచినీటి డిస్పెన్సర్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మల్లేశ్వరి, ఉపాధ్యాయులు రఘు, భాస్కరాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.